నగరంలో నాలుగిళ్ళు

సాయంత్రం ఐదున్నరయింది! వడగాల్పు కాస్తతగ్గి చల్లగాలి తగిలింది. ఎండకి భయపడి ఇళ్ళలోంచి బయటికి రావడానికి భయపడ్డ వాళ్ళందరూ నెమ్మదిగా బయటికి బయలుదేరుతున్నారు. ఆఫీసులనించి ఉరుకులు పరుగులతో ఇళ్ళకి చేరే వారు, బజార్లకి సినిమాలకి బయలుదేరినవాళ్ళు....ఎక్కడచూసినా జనం! ఎటు చూసినా హడావిడి! ఏదో ప్రళయం ముంచుకొస్తున్నట్టు ఎవరికి వారే హడావిడిగా పరుగులు పెట్టే జనంతో రోడ్లన్నీ నిండిపోతున్నాయి.

ఫ్యాక్టరీ కూత పెట్టింది. బిలబిలలాడుతూ జట్లుజట్లుగా కూలీలు చేతిలో క్యారియర్లతో ఉషారుగా బయటికి వస్తున్నారు.

రంగి, నర్సింలు నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ ఇంటికి బయలుదేరారు. త్రోవలో జనాన్ని, సినిమా పోస్టర్లనీ, దుకాణాలలో నగలు, చీరలు చూస్తూ గబగబ నడవసాగారు. బజారుదాటి కొంతదూరం వెళ్ళాక మామూలుగా సరుకులుకొనే షవారీ దుకాణంముందు ఆగారిద్దరూ. రంగి చీరకొంగు నించి మడతలు పడిన మూడు రూపాయలు తీసింది! బియ్యం, అణా చింతపండు, అణా మిర్చి, అణా ఉప్పు అవీ కొంది. వెంట తెచ్చుకొన్న సీసాకాయలలో పావలా నూనె, బేడ కిరసనాయిలు పోయించుకుంది. నర్సింలు పదిపైసల బీడీలు కొని ఒకటి అంటించుకున్నాడు. దిక్కులు చూస్తున్న రంగిని "ఏటేస్ చూ త్తండావు....నడు" అన్నాడు. రంగి బుర్ర గోక్కుంది. "వుండుమాఁవా, ఎందో మరిచిపోయాను"....ఇంకేది కొనాలో ఆలోచిస్తూ నిల్చుంది...."అ....అ....సావుకారూ, పదిపైసల సోడా కారం యీయి. మరి గంట రెండణాల ఉల్లిపాయలుకూడా గట్టు....అదిగో....ఆ ఉప్పు బిస్కట్తులు ఓ పది పైసల వియ్యి" అంది. షావుకారు ఇచ్చిన పొట్లాలు అన్నీ చీరకొంగున కట్టుకుంది. బియ్యం నర్సింలు పై పంచలో మూటకట్టింది. సీసాకాయలు, కార్యియర్ పట్టుకుని, షావుకారికి డబ్బిచ్చి బయలుదేరింది.

"పద మాఁవా!"....నాలుగడుగులు వేశాక మార్కెట్టు రాగానే...."

"రంగీ, సాపలు కొందారేటి?" అన్నాడు నర్సింలు.

"ఏటిమాఁవా, సొపలు, మాంసం రోజూ కొండానికి మనం లచ్చోది కార్లమా ...." అంది.

"కానేస్ రొయ్యలు కొని, యిన్ని ఉల్లిపాయలేసి, కమ్మగా పులుసెడ్తే యియాల!" పులుసు గుర్తొచ్చి నర్సింలు నోట్లో నీరూరుంది. బీడీ తీసి కుసుక్కున ఉమ్మాడు. రంగి పావలా రొయ్యలుకొని క్యారియర్ గిన్నెలో పెట్టుకుంది.

"నడు మాఁవా, చీకట్లడ్డాది....గుంటలేం సేస్తున్నారో ...." అడుగులు త్వరగా వేస్తూ అంది.

"ఉండే, పదిపైసలు మల్లెపూలు కొనకూడదంటే రంగీ!" రంగి వద్దని వాదించేలోపలే నర్సింలు ఓ దండ కొని వాసనచూసి రంగికి ఇచ్చాడు.

ఇద్దరూ గుడిసె చేరేసరికి దీపాలు పెట్టారు. తల్లినిచూసి రంగి ఆరేళ్ళ కూతురు, నాలుగేళ్ళ కొడుకు మట్టిలో యిరుగుపొరుగు పిల్లలతో ఆడుతున్నవాళ్ళు పరిగెత్తుకు వచ్చారు రంగి కొంగువిప్పి తెచ్చిన బిస్కట్లు ఇద్దరి చేతుల్లో పెట్టింది. బిస్కట్లు చేతిలో పడగానే ఇద్దరిమొహం విప్పారింది. మళ్ళీ ఆడుకోడానికి పరిగెత్తారు. రంగి చూరులోంచి తాళంతీసి గుడిసె తలుపులు తెరిచింది. తెచ్చినవన్నీ క్రిందపెట్టి తడుముకుని దీపంబుడ్డి తీసి కిరసనాయిలుపోసి వెలిగించి గూట్లో పెట్టింది. నర్సింలు గుడిసెలోంచి రెండు నులకమంచాలు తీసికెళ్ళి వెనకాల దడికట్టిన ఖాళీ జాగాలో పడేసి, కాళ్ళు చేతులు జాడించుకుని ఓ మంచం వాల్చుకు పడుకున్నాడు.

రంగి గబగబ పెరట్లో ఇటికల పొయ్యిమీద నీళ్ళకుండ పెట్టి రెండు చితుకులు మంటపెట్టింది. ప్రొద్దుట గబగబ యింత అన్నం వండుకుని తామిద్దరికి ఇంత క్యారియర్లో పెట్టుకుని పిల్లలకి ఓ కుండలో ఇంత ఉప్పేసి అన్నంలో నీళ్ళుపోసి పెడ్తుంది. పిల్లలిద్దరూ దగ్గర్లోని ఎలిమెంటరీ స్కూల్లో చదువుకోడానికిపోయి మధ్యాహ్నంవచ్చి ఆ గంజన్నం తింటారు. ఆ కుండలు, మూకుళ్ళు అన్నీ తోమి, పొయ్యి రాజేసి ఎసరు పెట్టింది రంగి. చాటలో బియ్యం పోసుకుని పెరట్లోకూర్చుని మొగుడితో కబుర్లు చెప్తూతూ రాళ్ళేరింది. రొయ్యలన్నీ శుభ్రంగాకడిగి బాగుచేసి పెట్టుకుంది. నీళ్ళు కాగగానే మట్టిలో పొర్లుతున్న పిల్లలిద్దర్ని లాక్కొచ్చి నబ్బు బిళ్ళతో తోమి గోరువెచ్చటి నీళ్ళు పోసింది. తరువాత తనూ రెండుచెంబులు చీర చుట్టబెట్టుకొని పోసుకుంది. తరువాత మాఁవని పిలిచి వీపుతోమి నీళ్ళు పోసింది. ఆ కుండలో మరికాసిని నీళ్ళు మరిగాక తెచ్చిన సోడాకారంవేసి విప్పిన కుళ్ళు బట్టలన్నీ నాన బెట్టింది. ఎసరు మరిగాక బియ్యంపోసి అన్నం వార్చి గబగబ రొయ్యల పులుసు కాచింది. సావకాశంగా కొప్పు ఊడదీసి నున్నగా దువ్వుకొని, మల్లెపూలు పెట్టుకుంది. పొయ్యి ఆర్పేసి పిల్లలకి, మొగుడికి అన్నాలు పెట్టింది. వాళ్ళు ఆవురావురు మంటూ అన్నం తింటూంటే తన కడుపు నిండిపోయినట్లనిపించింది

రంగికి. "పులుసు మా కమ్మగా వుందే రంగీ" అంటూ మరే యింత అన్నం పులు సేసుకొని కలుపుకొన్నాడు. అందరూ తిని లేచాక ఆ మూకుడులోనే తనూ తింది. మిగిలిన అన్నంలో నీళ్ళుపోసి ప్రొద్దుటికి ఉట్టిమీద పెట్టింది. కుండలు కడుక్కొని. దీపంబుడ్డి ఊదేసి, తడిక కట్టేసి పెరట్లో మంచందగ్గరికి వచ్చింది. పిల్లలిద్దరూ పగలల్లా ఆడి సాయంత్రం నీళ్ళు పోసుకొని వేడన్నం తిని వళ్ళుమరిచి నిద్ర పోతున్నారు. రంగి రావడంచూసి కాలుస్తున్న బీడి దమ్ములాగి అవతల పారేశాడు నర్సింలు. తన ప్రక్కన పడుకున్న కొడుకుని, అవతల కూతురు పడుకొన్న మంచంమీద పడుకోబెట్టాడు. "ఏ వెండలు మావా? మంట బెట్టేస్తాంది....అబ్బ.... అబ్బ....కొన్త నల్ల గాలి తిరుగుతోంది యిప్పుడే!" రంగి చీర దులుపుకొని మంచం మీద కూర్చుంది.

"మావా, రేపు సినిమా కెళ్దారే....అదేందో సానా బాగుందట అని సెప్పింది."

"సినిమా వూసు ఇప్పుడెందుకేస్....రేపు సూద్దాంలే...." అన్నాడు నర్సింలు రంగి చేయిపట్టుకొని లాగుతూ.

"ఉండు మావా. నీ కెప్పుడూ ఇదే మాలోకం!" అంటూ గునిసింది రంగి. "మావా....మరిగంటేం....ఆ పోద్దు సీతాలు కట్టుకుందే....అలాంటి లైలాను సిల్కు కోక కొనుక్కొంటాను అమ్మోరి జాతరికి...." కోరిక బయటపెట్టడానికి మంచి సమయం ఏదో రంగికి తెల్సు, ఇలాంటప్పుడు అడిగితే మావ కాదనడని తెల్సు రంగికి.

"కొనుక్కొందువుగానిలే....ఏ పాటి డబ్బు కూడబెట్టినావేటి?" అన్నాడు నర్సింలు రంగి తలలో మల్లెలు వాసనచూస్తూ.

"వుందిలే మావా, సీరకి సరిపోతది! ఒక సీర కొన్త మంచిదుంటే ఏ సిని మాకో ఎల్లినప్పుడు కట్టుకుందారని... "

రంగి, నర్సింలు ఇద్దరూకలసి రోజుకి నాలుగు రూపాయలు ఆర్జిస్తారు. మూడురూపాయలు బియ్యం, ఉప్పు, కూర నారకి సరిపోతుంది. ఓ అర్ధరూపాయిలో నర్సింలు బీడీలు, చా ఖర్చు, కర్రపుల్లలు ఏవో ఖర్చుకి సరిపోతుంది. ఆ మిగిలిన అర్ధరూపాయి రంగి ఓ ముంతలో వేసి దాస్తుంది. ఆ డబ్బుతోనే సినిమాలకి, నర్సింలు వారానికోసారి చుక్కేసుకోడానికి, అప్పుడప్పుడు బట్టా పాత కొనుక్కో డానికి దాస్తుంది రంగి. "సరేలే, కొందూగాని...." మాటలతో జాప్యం చేయడం ఇష్టంలేక రంగిని దగ్గరికి లాక్కున్నాడు నర్సింలు....నర్సింలు చుక్కేసుకున్నప్పుడు తప్ప మిగతా సమయంలో రంగిని నెత్తిమీద పెట్టుకుంటాడు. ఆ నిషాలో తన్నిన

తన్నులు రంగి ఆ వెంటనే మరిచిపోతుంది. "వుండుమా(వా ఓరన్నా సూత్తారు"....
ముద్దులు గుసుస్తూనే, రంగి దగ్గర చేరింది.

* * *

ఆరుగంటలు ఠంగు ఠంగున కొట్టింది. సుబ్బారావు రాస్తున్న ఫైళ్ళలోంచి తలె త్తిచూశాడు. ఆరుగంటలు! ఇంకా రాయాల్సినవి, అర్థంటనబడేవి అరడజనుపైన వున్నాయి! కాళ్ల చేతులు లాక్కుపోతుంటే కుర్చీలో వెనక్కి జారబడి కాళ్ళు చేతులు చాచుకుని ఆవలించాడు బద్ధకంగా సుబ్బారావు....అతనికి కడుపులో ప్రేగులు అరుస్తున్నాయి....పొద్దుట తొమ్మిదింటికి తిన్న తిండి మధ్యలో టీ అనబడే వేడినీళ్ళు తప్ప కడుపులో ఏం పడింది?.... లాభంలేదని ఫైళ్ళు మూసేసి, రాయాల్సినవి చంకన పెట్టుకుని, సైకిలుకి కట్టుకుని కాళ్ళీడ్చుకొంటూ త్రొక్కుకుంటూ బయలు దేరాడు ఇంటికి సుబ్బారావు.

గుమ్మంలో తనకి స్వాగతం పల్కడానికి నిల్చున్న పెళ్ళాన్ని చూసేసరికి గుండె గుభేలుమంది సుబ్బారావుకి! బియ్యం! పాలడబ్బా!.... ఆ మాటలు గుర్తొచ్చే! సరికి భార్యమొహం చూడడానికి భయంవేసి వెనక్కితిరిగి పారిపోవాలనిపించింది! ప్చ్! లాభంలేదు. ఏన్నాళ్ళు ఎక్కడికి పారిపోగలడు? బెదురుతూనే సైకిలు దిగాడు. సైకిలువంక ఆశగా చూసిన సత్యవతికి ఫైళ్ళుతప్ప ఏం కనబడలేదు, కొరకొర చూస్తూ లోపలికి వెళ్ళింది.

"పాలడబ్బా లేదన్నమాట. మనం ఇన్ని నీళ్ళుతాగి పడుకోగలం గానీ' నోరు వాయిలేని ఆ పసిదాన్ని ఎలా వూరుకోబెట్టను! అన్నింటికి గంగిరెద్దులా తల ఊపి, వెళ్ళి ఆ ఆఫీసులో కూర్చుంటారు. ఇంట్లో పెళ్ళాం పిల్లలు చచ్చిందీ, బ్రతికిందీ మీ కక్కరలేదు....ప్రొద్దుటవెళ్ళి సాయంత్రం ఇంటికొచ్చే మీకు నాచావెలా తెలుస్తుంది...." దండకం ఆరంభించింది భార్య. ఆ మాటలు క్రొత్తవి, విననివి గావు. కనక సుబ్బారావు జవాబు చెప్పలేదు! చెప్పడానికేముంది! బట్టలు విప్పి లుంగీ చుట్టబెట్టుకున్నాడు.

"మాట్లాడకండి. నేను వాగి వాగి చావడంతప్ప మీకేం బాధ! పసిపిల్లకి పాలు లేవని చెప్పినా మాట్లాడకుండా బెల్లంకొట్టిన రాయిలా వూరుకునే మీరు మనిషా బండరాయా? బియ్యంలేవు....ఇంకాసేపటికి ఆవురావురుమని పిల్లలొచ్చి పడతారు, ఏం పెడతాను వాళ్ళకి నా శ్రాద్ధం?....మాట్లాడరేం.

"ఏం మాట్లాడమంటావు? డబ్బుంటే తేవాలని నాకు తెలీదా! డబ్బుకోసం అందర్నీ అడిగాను. ప్రతినెలా ఇరవై తారీకునించి మన బ్రతుకు అప్పుల బ్రతుకే. ఎవరిస్తారు అన్తమానూ....అవి తీరవని వాళ్ళకి తెలిసి ఎలా యిస్తారు "నీర్సంగా అన్నాడు సుబ్బారావు.

"మరెలా? పిల్లలకేం పెట్టను?.... ఏ నీళ్ళో ఆ నీళ్ళఅవుపాలు పడదామన్నా. పాలది రెండు నెలలు బకాఇస్తేనేగాని పోయనంది! దాని కాళ్ళా వేళ్ళా పడితే అర్థశేరు ఇస్తుంది. కాఫీకి, మజ్జిగ నీళ్ళకి సరిపోతున్నాయి అవి—నేనేం చేస్తాను...." దిక్కుతోచక తల కొట్టుకుంది సత్యవతి.

"వెధవ సంసారం, వెధవపిల్లలు,....అందరం కలిసి కట్టుగట్టుకు చద్దాం. అప్పటికి గాని మనకి విముక్తిలేదు, వెధవపిల్లలు. పిల్లలా నా శత్రువులుగానీ, ఎక్కడలేని డబ్బూ వీళ్ళ పాలడబ్బాలకి, మందులకే చాలడంలేదు"

"అవునవును........పిల్లల్ని కనడం తెలుసుగానీ, పోషించేసరికి శత్రువు లవుతారు పదండి వాళ్ళ పీకా, నా పీక కలిపి నొక్కేయ్యండి.... తర్వాత హాయిగా వుందురుగాని...." అరుస్తూ కళ్ళొత్తుకుంది సత్యవతి.

"నోరు ముయ్యి కాసేపు వెధవ గోల. అక్కడ చచ్చీ చెడి యింటికొచ్చే సరికి యిక్కడ నీ గోల. వెధవ సంసారం ఒక్కనాడూ సుఖంలేదు. మీరు కాదు నేనే చావాలి ఉరెట్టుకుని ఎక్కడ సుఖపడిపోతానో అని పీకకి నిన్ను కలబెట్టారు గుదిబండలా; చావటానికన్నా లేకుండా...." చాతకాని ఉక్రోషంతో అరిచాడు సుబ్బారావు.

"అనండనండి....ఇంట్లో వస్తువులు లేదనడం నా తప్పు! ఎక్కడ నించి తెచ్చి మీ అందరికి వండి వారుస్తా ననుకున్నారు.... ఇరుగింటినించి, పొరుగింటినించి పూట గడుపుకొస్తూంటే మీకు తెలీకుండా వుంది. యింక నావల్ల కాదీ బదుళ్ళు తేవడం.ఎలా తెస్తారో, ఎక్కడనించి తెస్తారో బియ్యం తెస్తేనే వండుతాను.... లేక పోతే.... పస్తులుండండి...." విసురుగా వెళ్ళిపోయింది సత్యవతి.

సుబ్బారావుకి ఈ సంసారం గురించి తలచుకోటానికి భయం! నలుగురు పిల్లలతో నూట ఎనభై రూపాయల జీతంతో ఈ సంసారం ఎలా యీదాలో సుబ్బారావుకి తలబద్దలు కొట్టుకున్నా తెలియదు. చాలీచాలని జీతం! ఆకాశాన్నంటే ధరలు! ఆకలి, ఏడ్పు! రోగాలు, రొచ్చులు, మొత్తుకోళ్ళు, వీటన్నిటినించి తనకి విముక్తి ఎలాగో పాపం సుబ్బారావుకి అర్థంగాని విషయం! 'లేదు' 'లేదు' అన్న పదం తప్ప "వుంది" అన్నమాట సుబ్బారావు డిక్షనరీలో ఎంత వెతికినా కన బడదు....

"లేదు" యీ పూట అన్నంలేదు గాబోలు! ఆ మాట అనుకుంటే సుబ్బారావు ఆకలి మరింత పెరిగింది సాయంత్రం ఇంటికొచ్చాక ఆ పోసే కాఫీనీళ్ళన్నా పోయ లేదు భార్య ఉదయం రెండు చెంచాలు కాఫీ గూడ అప్పుతెచ్చి కాఫీ చేసింది కాఫీ పొడి లేదని నిన్ననే చెప్పేసింది. తెలుసుండి అడిగి చివాట్లు తినడం ఎందుకని

ఊరుకున్నాడు సుబ్బారావు. సత్యవతి ఎక్కడో అప్పుతెచ్చి అన్నం వండి వుంటదా అన్న చిన్న ఆశవుంది అతనికి. భోజనానికి పిలుపుకోసం వళ్ళంతా చెవులు చేసుకుని ఎదురుచూశాడు. ఎంతకీ సత్యవతి పిలువలేదు, నిజంగానే చేయలేదా ఏమిటి ఖర్మ....వంటింటివైపు చూడాలంటే అభిమానం అనిపించింది. చాపేసుకుని, కాళ్ళు ముడుచుకుని పొట్టలో పెట్టుకుని పడుకున్నాడు సుబ్బారావు చిన్న కునుకు పడుతూండగా అన్నానికి దయచేయండి, అన్న సత్యవతి పిలుపు వినిపించింది దిగ్గున లేచాడు సుబ్బారావు. ఆ పిలుపులో ఆప్యాయత, ఆదరణ, లేదని తెలిసిన, పౌరుషం అన్నమాటకి అర్థం మరిచిపోయిన సుబ్బారావు వెంటనేలేచివెళ్ళి విస్తరి ముందు కూర్చున్నాడు. ఆవురావురు మంటూ వెళ్ళిన సుబ్బారావుకి విస్తరి చూసే సరికి ఆకలిచచ్చిపోయింది. ఇంత పెసర పచ్చడివేసి అన్నం వడ్డించింది. భార్య "కూరేం చెయ్యలేదూ?" భయపడుతూనే అడిగాడు సుబ్బారావు...."ఆచేస్తాను. సంచులతో కూరలు తెచ్చి నా మొహాన దిమ్మరిస్తున్నారు. రెండు పూటలా కూరలు వండి వారుస్తాను" చేతులు తిప్పుతూ పెళుసుగా అంది సత్యవతి పచ్చడి కలిపి నోట్లో పెట్టుకుంటే గొంతు దిగనంది. "ఓ నెయ్యిచుక్క, నూనెచుక్క వెయ్యి!" అందామని నోరుతెరిచి మళ్ళీ మూసుకున్నాడు సుబ్బారావు. వచ్చే జవాబు తెలిసి.

"మధ్యాహ్నం పాదున కాసిన నాలుగు దొండకాయలు మీ మట్టుకు కూర చేశాను, పిల్లలకైనా ఓ ముక్క వేయకుండా. గుప్పెడు పెసరపప్పుంటే యీ పూటకి పచ్చడన్నా చేశాను. రేపు అదీ వుండదు.... "సత్యవతి ఏదో చదువుతూనేవుంది. సుబ్బారావు పచ్చడి ముద్దలు గుటుకుగుటుకు మింగి చారు అనబడే వేడినీళ్ళు పోసుకుని రెండు ముద్దలు తిని, మజ్జిగ అనే చల్ల నీళ్ళువేసుకున్నాడు. "యింత ఉప్పన్నా తగలెయ్యి" మొగం చిట్లించి అన్నాడు మజ్జిగ అన్నం నోట్లో పెట్టుకుని.

"బావుంది విసుగు, గడ్డ పెరుగు వేస్తాను, మీరు రెండు చేతుల్తో డబ్బు పోస్తున్నారని....డబ్బు మాట ఎత్తితే నా అంత ఎత్తు ఎగురుతారుగానీ, విస్తరి ముందుకూర్చునే సరికి విస్తరి నిండాలి...."

"నోరు ముద్దూ....యీ తిండన్నా తిననిస్తావా, వెధవ సోదా నీవూ...." కసిరాడు సుబ్బారావు చెయ్యి కడుక్కుని గదిలోకి వెళ్ళేసరికి పిల్లలు చింకి చాపల మీద, కుళ్ళు దొంతలమీద ఒకర్నొకరు కరుచుకుని నిద్రపోతున్నారు. వాకిట్లోవున్న మంచి ప్రక్కమీద నడుం వాల్చాడు. గట్టిగా కాళ్ళు చాచుకుంటే ఏ పెట్టెలో, సామానులో కాళ్ళకి తగుల్తాయి. ఒకే గది సామాను గది, పడకగది అన్నీ అదే! ఇంకోటి వంటగది నలుగురూ ఒక్కసారి కూర్చుని భోజనం చెయ్యడానికి సరిపోదు. అదే ముప్పై రూపాయలద్దె! నిద్ర పోతున్న పిల్లలవైపు చూడడానికికూడ సుబ్బారావుకి భయం; వాళ్ళ భవిష్యత్తు భూతంలా ఎదుట నిలబడి భయపెడ్తోంది. వెధవ బ్రతుకు! కన్నపిల్లలే శత్రువుల్లా కనబడుతున్నారు! తనలాంటివాళ్ళు అసలు పెళ్ళి

చేసుకోడానికి వీలులేదని గవర్నమెంటు రూలుపెట్టాలి! పెళ్ళి చేసుకున్నా పిల్లల్ని కనరాదని. రూలు ఉల్లంఘించినవారికి ఉరిశిక్ష వేయాలి! అప్పుడుగాని తనలాంటి వారికి విముక్తిలేదు....తన ఆలోచనలు తనకే విపరీతంగా కనిపిస్తాయి సుబ్బారావుకి. చాతకాని చవట ఆలోచనలు!....చంటిది లేచి ఆకలి గాబోలు గిపెట్టి ఏడుస్తూంటే సుబ్బారావు ఆలోచనలు చెదిరిపోయాయి.

లేచి సముదాయించడానికి కూడా ఓపిక లేనట్టు అలాచూస్తూ వుండిపోయాండు భోంచేస్తున్న సత్యవతి విసురుగా వచ్చి మొగుడివైపు తీక్షణంగా చూసింది...."చంటిపిల్ల ఏడుస్తున్నా వినిపించడంలేదా?.... ఆహా....హా! శతృత్వం! కన్న పిల్లలమీద శతృత్వం సాగించే తండ్రిని నిమ్మల్నే చూశాను నోరు మూయవే ముండా, ఏడిచావంటే చంపేస్తాను యీసారి రెండు మెతుకులు తినడానికి కూడా నోచుకోలేదు యీ కొంపలో! ఎంత పాపం చేసుకుని యీ కొంపలో పడ్డానో! ఏ నోములు, ఏ పూజలు చేసుకుంటేనో యిలాంటి మొగుడు యీ పిల్లలు! రామచంద్రా పగవాళ్ళకికూడా వద్దు యీ నరకం!...." తన నెత్తి బాదుకుంది. అంటచేత్తోనే పిల్లవీపున రెండు బాదింది. తీసికెళ్ళి వంటిల్లో కూలేసింది పిల్లని సుబ్బారావు కిదేం కొత్తకాదు! పాపం ఒక ర్తీ చేసుకోలేక యీ సంసారం యీదలేక విసుక్కుంటుంది. ఆ అరుపులు, కేకలు లెక్కచెయ్యకుండా నిర్వికారంగా వుండడం ఏనాడో అలవాటు చేసుకున్నాడు సుబ్బారావు.

ఎప్పటికో ఇల్లు సర్దుమణిగింది... "వెధవ దోమలు, ఉక్క అబ్బబ్బ రాత్రన్నా సుఖంగా పడుకోడానికి లేదు గదా. ఆరుబయట పడుకోడానికన్నా అదృష్టంలేదు, యీ కొంపలో...."పగలంతా చాకిరిచేసి రాత్రన్నా సుఖ నిద్రకి నోచుకోడానికి లేదని అపసోపాలు పడుతూ విసురు కొంటున్న భార్య దగ్గిరికి జరిగాడు సుబ్బారావు. "వెళ్ళండవతలికి" విసిరి కొట్టింది చెయ్యి సత్యవతి. "ఏం వున్నా లేకపోయినా, దీనికి లోటులేదు నా దగ్గిరికి రాకండి....చెపుతున్నాను. వెళ్ళండవతలకి....సిగ్గులేక పోతే సరి...." విదిలించి కసిరింది సత్యవతి. అన్ని విషయాల మాదిరిగానే యీ విషయంలోనూ భార్య మాటలు విదిలింపులు లెక్కచెయ్యడం మానేశాడు సుబ్బారావు. ఆ కసుర్లు లెక్కచేసి, తన బ్రతుకులో డబ్బవసరం లేని ఏకైక సుఖాన్ని, ఆ కొద్ది క్షణాల ఆనందాన్ని, ఆ స్వర్గాన్ని దూరం చేసుకోలేడు సుబ్బారావు!

* * *

"సారీ! శాంతా....అయిదు గంటలకి బయలుదేరే వేళకి అర్జంటుగా ఏదో పనుందని ఛీఫ్ ఇంజనీరు ఫోనుచేసి ఆఫీసుకి రమ్మన్నారు. లేటయిపోయింది." కారు గేరేజిలో పెట్టి లోపలికి వస్తూనే అన్నాడు కృష్ణమూర్తి, మొహం ముడుచుకుని లోపలికి వెళ్ళిపోతున్న శాంతతో వెడుతూ, శాంత మాట్లాడకుండా లోపలికెళ్ళి కాఫీతెచ్చి

టేబిల్‌మీద పెట్టింది. ముస్తాబు చేసుకుని రడీగావున్న శాంతిని నిరుత్సాహపరచవలసి వచ్చినందుకునొచ్చుకున్నాడు మూర్తి. "కోపం వచ్చిందా శాంతా! ఏం చెయ్యమంటావు చెప్పు, హెడ్ ఆఫీసుకి వెళ్ళి ఆ కాగితాలు చూపించి పనిపూర్తి చేసుకుని వచ్చేసరికీ ఆలస్యం అయింది రేపు వెడదాం."

"ఇవాళ ఆఖరి రోజనిగాదూ, మీతో అంతగా చెప్పాను." మొహం ముడుచుకొనే అంది శాంత.

"అయితే నన్నేం చెయ్యమంటావు. పోనీ సెకండ్ షోకి వెడదామా?"

శాంత మొహం ఒక్కక్షణం వెలిగింది. అంతలోనే నిరుత్సాహంగా "పిల్లలో" అంది.

"పోనిద్దూ....యీ సినిమా చూడకపోతే ఛస్తామా. ఇది కాకపోతే మరోటి రేపు చూద్దాం. ఈ నగరంతో సినిమాల కేం కొదవ. రేపు దేనికోదానికి వెడదాం. ఓకే!" భుజంమీద చెయ్యి వేసి దగ్గరకి తీసుకొని భార్యామణి అలక పోగొట్టడానికి ప్రయత్నిస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

"నర్లేండి....వదలండి.... ...." చీర మార్చుకోడానికి లోపలకెళ్ళింది శాంత.

కాఫీ తాగి ప్రొద్దుట పూర్తిచేయని పేపరు చేతిలోకి తీసుకున్నాడు ఆడుకోడానికి వెళ్ళిన ఎనిమిదేళ్ళ రవి, ఆరేళ్ళ బేబి తండ్రి రావడం చూసి పరుగెత్తుకు వచ్చారు. ఇద్దరూ చెరోవైపు తండ్రిమీద వద్దారు "డాడీ బొమ్మల పుస్తకాలు తెచ్చావా? డాడీ నా బూట్సు చాలడంలేదు. క్రొత్తవి కొనాలి డాడీ," అంది బేబి. "ఆ నీకేనేంటి క్రొత్తవి, నా బూట్లూ చిరిగిపోతున్నాయి నాకూ కొనాలి డాడీ." రవికూడా గొడవ చేశాడు.

"అలాగే అలాగే కొంటానన్నాగా. ఫస్టు రాగానే కొంటానుగా మరి అల్లరి పెట్టకండి ఇంక. యిప్పుడు గొడవ చెయ్యకండి. జీతం రాగానే కొంటాను ఏం "ఇద్దర్ని దగ్గరికి తీసుకుని ముద్దుపెట్టుకుని అభయం ఇచ్చాడు మూర్తి.

"బాగుంది.....బొమ్మల పుస్తకాలకి కూడా ఫస్టు రావాలా ఏమిటి? బొత్తిగా గుమస్తాలా మాట్లాడుతారు." నవ్వింది శాంత.

"పేరుకి గెజిటెడ్ ఆఫీసర్ని. క్లాస్ వన్ ఆఫీసర్ని. తొమ్మిది వందల జీతం అన్న పేరేగాని మనదగ్గర ఏముంది? నెలాఖరికి దమ్మిడీ వుండదు చేతిలో....ఎంత చెట్టుకు అంతగాలి! రెండొందల జీతగాడికి అది చాలదు, వెయ్యి వచ్చినా మనకు చాలదు!.....పెధవది ఓ స్టేటస్ అంటూ ఏడ్చిందిగా, అది మైన్‌టైన్ చెయాలంటే.... వెయ్యి రూపాయిలనగా ఎంత?...."

"అవునులెండి గానీ....యివాళ పేపర్లో చూశాను. కొత్తగా ఆల్విన్ ఫ్రిజిడేర్లు వాయిదాలమీద కొనుక్కో వచ్చని వుంది....మనమూ కొందామా?"

"మనకు రిఫ్రిజిరేట రెందుకు?" అన్నాడు మూర్తి.

"మనకెందుకేమిటి? బాగుంది. చల్లని నీళ్ళు త్రాగుతాం, కూరలకి, పళ్ళకి రోజూ బజారుకి పరుగెత్తకుండా వారానికోసారి కొనిదాచుకోవచ్చు.

కొందామంటే ఒకసారంటే డబ్బుపోగవదుకానీ, నెల నెలా తీర్చుకోవచ్చుగా ఉత్సాహంగా అంది శాంత.

"అబ్బ ఇప్పుడు ఎందుకు చెప్పు, కోరికలకి అంతంటూ ఎక్కడ వుంది! కారు కారన్నావు దాని లోను యింకా తీరలేదు....యిప్పుడు మళ్ళీ దీనికికూడా జీతంలో నెల నెలా కోత అవుతూంటే యింక మిగిలింది మనం ఏం తింటాం?"

"మీరెప్పుడూ యింతే! ఏ సరదా లేదు....ఎప్పుడూ ఏకో తిండికి మాడి పోతున్నట్టు మాట్లాడతారు....చేసేది ఆఫీసరు పని! ఆ మాత్రం ఫ్రిజిడేరు కొనుక్కునే తాహతు మనకు లేదా? ఆ రామ్మూర్తి మీ కంటె పెద్ద ఆఫీసరా ఏమిటి?"

"రామ్మూర్తి కేం ఫ్రిజిడేర్లూ కొంటాడు-ఎయిర్‌కూలర్లు పెట్టిస్తాడు అతనితో మనకేమిటి వంతు అడ్డదార్లు తొక్కితే ఏదన్నా చెయ్యొచ్చు...."

"పెద్ద సత్యసంధులు బయలుదేరారులెండి....ఏది చెప్పినా యిలాగే అంటారు...." కోపంగా లేచి వెళ్ళిపోయింది శాంతి!

ఈ ఆడవాళ్ళకి బొత్తగా ముందు చూపుండదేమిటో ఖర్మ! చిరాకు పడ్డాడు మూర్తి. యీ కోరికలకి అంతెక్కడ? స్కూటర్ అంది ముందు. తరువాత పిల్లలు ముగ్గురయ్యారు. స్కూటర్ చాలదు, కారు కొనాల్సిందే అంటే లోను తీసుకొని కారుకొన్నాడు పోనీ కారుంటే టి-ఏ వస్తుంది. కారు లోను తీరిపో తుందిలే అని ఒప్పుకున్నాడు. ఇప్పుడు ఫ్రిజిడేరు అంటుంది— తరువాత టేపు రికార్డర్, రేడియోగ్రా మంటుంది! ఇంకొన్నాళ్ళు పోతే ఎయిర్‌కూలరు లేకపోతే వుండలేనంటుంది.....ఆఫీసరన్న పేరు తప్ప గవర్నమెంటు జీతాలెంత? ఏం సరిపో తుంది? ఇంటద్దె రెండువందలు! సరే, హోదాకి తగినట్టు ఇంట్లో ఫర్నిచరుండాలి గదా! సరే, వంటవాళ్ళని యీ రోజుల్లో భరించలేంగదా అని శ్రీమతి కష్టపడకుండా గ్యాస్‌స్టవ్‌లు, ప్రెషర్ కుక్కర్లు మొదలైన ఆధునిక సామాగ్రి కొన్నాడింట్లో.... పిల్లలు ముగ్గురు! ఇద్దరికి కాన్వెంటు స్కూలు జీతాలు బస్సు ఖర్చులు, తిండి ఖర్చు

ఏది తగ్గించుకోలేరుగా! వాళ్ళకి పాలు, పళ్ళు, గ్రుడ్లు, ఏదీ మానలేరు! పిల్లల్ని నవ్యంగా పెంచాలనిగాదూ ముచ్చటగా ముగ్గురుని కన్నది! వాళ్ళ ఆరోగ్యం కంటె ఏది ముఖ్యం? ఇంక నరే సినిమాలు, మాగజైన్సు—చిల్లర ఖర్చులు ఎన్నో! ఏదీ మానలేదు: నెలాఖరికి దమ్మిడీ మిగలదు! క్రింద తరగతివారితో కలవలేరు, పై తరగతి వాళ్ళని అందుకోలేరు. ఎటూకాని త్రిశంకు స్వర్గం తమది.

యీ బాధలేం ఆడవాళ్ళకి అర్థంగావు! పెళ్ళయిందగ్గర నించి సినిమా సెట్టు లాంటి యిల్లు, సినిమా జీవితం లాంటి జీవితం కావాలి విసుగ్గా అనుకున్నాడు మూర్తి.

కాంత వంటింట్లో దబదబ గిన్నెల చప్పుడు చేస్తూంది.... అంటే కోపం వచ్చిందన్నమాట! ఇంక, యీ ఫ్రిజిడేరు కొంటాననేవరకు ప్రాణం వున్న వాటి మీద, లేనివాటిమీద కంబయిండ్‌గా కోపం తీర్చుకుంటుంది. భోజనం దగ్గరకూడా ఏం మాట్లాడకుండా విసురుగా వడ్డించింది. పిల్ల లేదో అడిగితే "నోరుమూసుకుని అన్నం తిని వెళ్ళండి అని కసిరింది. పలకరిస్తే మరింత చిందులు తొక్కుతుందని మాట్లాడకుండా తిని లేచి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

పిల్లలకి నైట్ డ్రస్సులు తొడిగి, దోమతెరలు దించి, ఫానువేసి, గుడ్ నైట్ చెప్పి, టేబిల్ లైట్ వేసుకుని పుస్తకం తీసుకున్నాడు చదవటానికి కృష్ణమూర్తి కాంత వంటిల్లు సర్దివచ్చి మాటా మంతీలేకుండా తనూ ఓ పుస్తకం తెరిచింది.

కృష్ణమూర్తి పుస్తకంమీద దృష్టి నిలవలేదు. కాంత అలా మాట్లాడకండా ముభావంగా వుంటే ఏదోలా అనిపించింది. ఉదయం పదిగంటలలోపున పని తొందరలో హడావిడిగా వుంటుంది కాంత. తామిద్దరూ ఏం మాట్లాడుకున్నా రాత్రి భోజనం అయ్యాక ఓ గంటా రెండు గంటలు! కాంత ఏవేవో కబుర్లు చెపుతూంటే యిట్టే గడిచిపోయేది కాలం! కాంతతో మాట్లాడకుండా తనొక క్షణం వుండలేడు!

"కాంతా?—అలా వున్నావేం...." చేయిపట్టుకుని అడిగాడు.

"ఎలా వున్నాను!" పుస్తకంలోంచి దృష్టి మరల్చకుండానే అంది కాంత.

"కోపంగా వున్నావు....మాట్లాడవేం....కోపం వచ్చిందా?"

"వస్తే మీకేం?"

"ఏమిటి కాంతా! మరీ చిన్న పిల్లలా అవుతావు....ప్రతిదానికీ అలకేనా?.... నాకు బోలెడు కోరికలున్నాయి....కానీ మన అంతస్తు చూసుకోవద్దూ!...."

"ఏం నేనేం కోరికలు కోరాను....వజ్రాలు, వైఢూర్యాలు కావాలన్నానా? ఎయిరోప్లేనులలో తిప్పమన్నానా? ఎయిర్ కూలర్లు కావాలన్నానా? ఏం మన తాహతు ఫ్రిజిడేరు కొనుక్కునే సాటిదిగాదా? .... పుస్తకం ప్రక్కన పడేసి గయ్యమంది కాంత.

"ఆ... ఇదయ్యాక....ఒక్కొక్కటీ అవీ కావాలంటావు!" నవ్వాడు.

"కావాలంటే అన్నీ కొనేస్తున్నారు కొనేస్తున్నారు కాబోలు! ప్రతి దానికి ఇన్నిసార్లు అడిగితేగాని ఏదీకాదు అన్నీ అడగ్గానే అమరుస్తున్నట్టు మాట్లాడకండి. కొనకపోతే మానేయండి....నరదా నా కొక్కదానికేనా? యిప్పుడు కాకపోతే మానే ముచ్చట ఎప్పుడు తీరు తుంది? వస్తువు యింట్లో వుంటుందిగదా అనిగానీ ..."

"అవుననుకో. కాని డబ్బేది....చూస్తున్నావుగా ఖర్చులు! ...పిల్లలు పెద్ద వాళ్ళవుతున్నారు. రేపొద్దున వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు అన్నీ జరగాలి! ఈ రోజుల్లో చదువులు, ఉద్యోగాలకి అవస్థలు ఎలా వున్నాయో చూస్తున్నావుగా. వాళ్ళ భవిష్యత్ ఏమిటా అని ఆలోచిస్తే బెంగగా వుంటుంది. వాళ్ళకి పెద్ద చదువులు చెప్పించాలంటే యిప్పుడు మనం జాగ్రత్తగా వుండాలి."

"అబ్బ!....ఏదో పిల్ల పెళ్ళికి ఎదిగికూర్చున్నట్టు, మొగపిల్లలిద్దరూ ఏ మెడిసనో, ఇంజనీరింగో చదువుతున్నట్లు మాట్లాడతారేమిటి?.... పట్టుమని పదేళ్ళయినా లేని పిల్లల గురించి యిప్పటినించీ బెంగ?"

"యిప్పటినించీ లేకపోతే అప్పుడెలా వస్తుంది?...."

"బాగుంది....ఎల్లకాలం మీరీ జీతంతోనే వుంటారా! పిల్లలు పెద్ద వాళ్ళయి నప్పటి మీ జీతం పెద్దదవదా?....అయినా, నే నేదడిగితే వెంటనే చేశారుగనక....వద్దు లెండి....మానేయండి... నరదాకి అడిగాను అంతే...." మొహం ముడుచుకొని అంది కాంత.

"అదిగో ఆ కోపమే వద్దన్నాను ... అంత కోపం అయితే ఎలా? సరే.... నాకేం పోయింది. కొనమంటే కొంటాను నా ఆరాటం అంతా మీ గురించేగా........ మీ భవిష్యత్తు గురించి నీకంత నిబ్బరంవుంటే నాకు మాత్రం ఏం భయం? ....అలాగే రేపు వెళ్ళి కొందాం సరేనా?"

భార్య మొహంలో విరిసిన ఆనందంచూసి తృప్తిగా నవ్వాడు కృష్ణమూర్తి. కాంత యీసారి ఖర్తచేయి తీసేయలేదు.

* * *

పోర్టికోలో కాడిలాక్ కారాగింది. డ్రైవరు తలుపుతెరిచి పట్టుకున్నాడు. రాజారావు చిరాగ్గా ఏదో ఆలోచిస్తూ కారు దిగి, ఎదురొచ్చిన నౌకరుమీదికి కోటు విసిరాడు. బెడ్ రూమ్‌లోకి వెడుతూనే.... కేకలు పెట్టాడు. బంట్రోతుమీద. "నీ కెన్ని సార్లు చెప్పాను, నే నొచ్చేసరికి యీ గది చల్లగా వుంచాలని! యిప్పటివరకు ఏం చేస్తున్నావు?"

నౌకరు నీళ్ళు నమిలాడు. గబగబ వెళ్ళి ఎయిర్‌కూలర్ స్విచ్ ఆన్ చేశాడు.

"గెటౌట్!" విసుగ్గా అరిచాడు రాజారావు. వాడు అతివినయంగా "చా తెమ్మంటారా సాబ్!"అనడిగాడు రాజారావు ఫోమ్ సోఫాలో ఫోమ్ తలగడాకి జారగిల కాళ్ళూచేతులూ జాచుకుని కూర్చున్నాడు. వాచి చూచుకున్నాడు. "అక్కరలేదు...." అన్నాడు....వాడు వెళ్ళిపోతుంటే మళ్ళీ గుర్తువచ్చి "అమ్మగారేరి?" అడిగాడు.

"క్లబ్బుకి వెళ్ళారు సాబ్!...."

"ఎవరితో?"

"తులాసీసాబ్ వచ్చారు....ఇద్దరూ వెళ్ళారు."

"హుం" రాజారావు చేతిలో సిగరెట్టు వేళ్ళ మధ్య నలిగిపోయింది. కసిగా నలిపి ఏష్‌ట్రేట్‌లో పారేశాడు. "తులాసీ!" ఆ పేరు తలచుకుంటే రాజారావు వళ్ళు మరింత చిటపటలాడింది. లేచి విసురుగా పచార్లు సాగించాడు. మళ్ళీ కూర్చుని తల రెండుచేతులతో నొక్కుకున్నాడు కణతలు బ్రద్దలవుతున్నాయి; ఫ్యాక్టరీలో యింతసేపూ రెండొందలమంది కూలీలు ఘెరావోచేసి కదలనీయలేదు! తలనొప్పి మరింత ఎక్కువయింది ఇంటికొచ్చేసరికి....ఎప్పుడూ అంతే! తన తలనొప్పి యింటి

కొచ్చేసరికి మరింత ఎక్కువవుతుంది! శారీరకబాధ, మానసిక ఆవేదన రెండూ మరచిపోవాలంటే ఒకటే దివ్యౌషధం! "ఖుషీరామ్!" పెద్ద కేక పెట్టాడు రాజారావు. నౌకరు చేతులు కట్టుకు నిలబడ్డాడు. "గ్లాసులు, ఐసు తీసుకురా?" అన్నాడు. బీరువా లోంచి వాట్ 69 తీసి ఐసు వేసుకుని కలుపుకున్నాడు రాజారావు సోడావేసి ఒకపెగ్ త్రాగేసరికి మనసు చల్లబడింది. అలా సిగరెట్టు త్రాగుతూ రెండు మూడు పెగ్‌లు పూర్తిచేశాడు. అలవాటయిన కారణంగా అతనికేం కాలేదు. కానీ ఈ లోకంలోంచి శాన్త మైమరపించింది! ఆవేదన తగ్గిందనిపించింది. ఓ గంట అయ్యాక మళ్ళీ నౌకరుని పిలిచాడు. "స్నానం చేస్తాను. టబ్‌నిండా నీళ్ళు నింపు!" ఆజ్ఞాపించాడు ఖుషీరామ్ టబ్‌నిండా నీళ్ళునింపి టవల్స్ రెడీచేశాడు. అయ్యగారి బూట్లువిప్పి, బాత్ రూము శాండల్స్ కాలికి తొడిగాడు. చన్నీళ్ళలో లవండర్ సబ్బుతో స్నానంచేశాక శాన్త సేదదీరి, అతని వళ్ళు, మనసు చల్లబడింది. అలా టబ్‌లో పడుకునే సిగరెట్టు వెలిగించుకున్నాడు. ఎదురుగా తీసిన తలుపు సందులోంచి గదిలోని రమ బస్టుసైజు ఫోటో నవ్వుతూంది. రాజారావు మొఖం తిప్పుకున్నాడు రమ! రమాదేవి! లక్షల కధికారి రాజారావు భార్య లోకానికి అంతే తెలుసు! పేరుకి మాత్రమే తన భార్య! రాజారావు క్రూరంగా నవ్వుకున్నాడు? ఆవిడకి తన డబ్బు, తన హోదా పని కొస్తుంది! తను పనికిరాడు! ఆవిడ లోకంవేరు! తన లోకం వేరు! ఆవిడ లోకం క్లబ్బులు, కోక్‌టైల్సు, పార్టీలు, డాన్సులు, ఫ్రెండ్సు! తనలోకం ఫ్యాక్టరీలు, కూలీలు, ఘెరావోలు, స్ట్రయికులు, లాభ, నష్టాల బేరీజులు ఆమె లోకంలోకి తన లోకంనించి వెళ్ళలేడు. వెళ్ళడానికి మనసూ లేదు! టైమూలేదు! తన లోకంలోపడి శ్లేష్మంలో ఈగలా కొట్టుకుంటున్నాడు! ఆవిడాలోకంలో విహంగంలా విహరిస్తూంది!

అలా అరగంట నీళ్ళల్లో కూర్చుని లేచి పైకి వచ్చాడు! రాజారావు. నైటు సూటు తొడుక్కుని పిల్లల గదిలోకి వెళ్లాడు! తొమ్మిదిన్నర! పిల్లలిద్దరూ సిల్కు నైట్ డ్రస్సులలో ఫోము బెడ్లమీద ఎయిర్ కూలర్ చల్ల పరిచిన గదిలో నిద్ర పోతున్నారు ప్రశాంతంగా! వాళ్ళ ఆయా క్రింద పడుకుని గుర్రు పెడుతూ నిద్ర పోతుంది. అదృష్టవంతులు! నిట్టూర్చాడు రాజారావు. వంగి, పిల్లలిద్దర్నీ ముద్దు పెట్టు కున్నాడు. కర్టన్సులాగి నెమ్మదిగా గదిలోంచి బయటికి వచ్చాడు, అంతా మరచి పిల్ల లతో హాయిగా కాసేపు గడపడానికన్నా నోచుకోలేదు తను. వాళ్ళటైము తన టైము కుదరదు ప్రొద్దుట ఎనిమిది గంటలకే లేచి తయారై బ్రేక్‌ఫాస్ట్ తీసుకుని పైకి వచ్చే

నరికే ఇద్దరూ కారులో కాన్వెంటుని వెళ్ళిపోతారు. రాత్రి తను వచ్చేసరికి నిద్ర పోతారు. ప్చ్!. ఏం బ్రతుకో! పిల్లలకి, మంచి ఇంగ్లీషు సినిమా పిల్లల సినిమా వచ్చింది తీసికెడతానని ప్రామిస్ చేశాడు. రోజూకంటె ముందు బయలుదేరాడీవాళ! వెధవలు కూలీలందరూ కట్టకట్టుకుని ఘెరావో చేశారు రెండు గంటలు! రాస్కెల్స్, డర్టీరోగ్స్! షూట్ చేసి పారేయ్యాలి వెధవల్ని! రోజూ స్ట్రయికులు, ఘెరావులు! రోజుకోసారి జీతం పెంచాలి! తిండిలేని వెధవల్ని పిలిచి కూలీయిస్తే తల తిరుగుడు! వాళ్ళకోరికలు తీరుస్తున్నకొద్దీ పెరుగుతుంటాయి. వాళ్ళనని ఏం లాభం! వాళ్ళని నెత్తెక్కించుకుని తమమీదికి ఉసికొల్పే ప్రభుత్వాన్ని అనాలసలు! వెధవ ఫ్యాక్టరీలు మూసిపారేసి, ఏదో ధరకి అమ్మిపారేసి, ఆ ఉన్నడబ్బుతో ఎక్కడో ప్రశాంతంగా జీవితం గడపాలనిపిస్తూంది. కానీ! లాభంలేదు యిదో ఊబి. యిందులో దిగాక మరి లేవలేరు; యీ జీవితం అందించే! సౌఖ్యాలపై లోభం తమని ఆ ఊబిలోంచి పైకి రానీయదు!

పదిగంటలు కొట్టింది! ఆవిడగారి కోసం ఎదురుచూడటం దండగ! రాజారావు లేచి డైనింగ్ రూములోకి వెళ్ళాడు. కునికిపాట్లుపడు తున్నవంటవాడు గాభరాగా లేచి అన్నీ అమర్చాడు టేబిల్ మీద! భోజనం అయిందనిపించుకుని ఇవతలికి వచ్చాడు. బెడ్ ప్రక్కన లాంప్ స్విచ్ నొక్కి ఓ యింగ్లీషు నవల తీసుకున్నాడు చదవడానికి. పదకొండు కొట్టాక కాసేపటికి బయట కారు చప్పుడు వినిపించింది. దాంతోపాటు నవ్వులు, బై బైలు, గుడ్ నైట్లు వినిపించాయి. కూనిరాగంతీస్తూ కులాసాగా లోపలికి వచ్చిన రమని పుస్తకంలోంచి చూశాడు రాజారావు రమతో పాటు ఖరీదయిన వింత సెంటు పరిమళం గదంతా అలుముకుంది ఆ సెంటు తమది కాదు! ఎవరిదో రాజారావుకి తెలుసు! రాజారావుని చూసి కూనిరాగం ఆపింది! రమ బ్యాగు డ్రస్సింగ్ టేబుల్ మీదికి విసిరి, అద్దంలో వయ్యారంగా తన అందం చూసుకుంది. సావకాశంగా ఫాషన్ చుట్టిన సిగలోంచి పిన్నులన్నీ లాగింది జుత్తు బుజాలమీదికి జారేట్టు బ్రష్ చేసుకుంది. కర్టెనులాగి బట్టలు మార్చి నైలాన్ నైట్ గౌను తొడుక్కుంది. బాత్ రూమ్‌కి వెళ్ళి ముఖం కడుక్కుని పౌడరద్దుకుని వచ్చింది. డైనింగ్ రూములోకి వెళ్ళి భోజనం చేయనని వంటవాడితో చెప్పి వచ్చింది, ప్రక్కదగ్గిరికి వచ్చి తల గడలు సర్దుకుని పడుకోబోయింది. అంతా ఒకవంక కనిపెడ్తున్న రాజారావు వళ్ళు ఉడికిపోయింది. ఎంత నిర్లక్ష్యం! ఎంత తలతిరుగుడు! మొగుడన్న మనిషి ఎదు

రుగా వుంటే చూడనైనా చూడనట్టు, పలకరించకుండా ఎంత తలబిరుసుగా ప్రవర్తిస్తూంది. ఇంట్లో కట్టుకున్న మొగుడుండగానే బయట ఎలాంటి వేషాలు వేస్తూంది!.... హూ.... తనే కొమ్ములు యిచ్చాడు మొదట!....యీ రోజు విచారించి ప్రయోజనం ఏమిటి?....పరువు, ప్రతిష్ఠ కోసం అన్నీ సహిస్తున్న కొద్దీ మరింత చెలరేగుతూంది! ఎన్నాళ్ళిలా రాజారావు ఎంత అణుచుకుందామని ప్రయత్నించినా ఆవేశం అణగలేదు. నెమ్మదిగా పుస్తకం ప్రక్కన పెట్టాడు.

టైమెంతయిందిప్పుడు?" రమ మొహంలోకి సూటిగా చూశాడు రాజారావు.

"పదకొండున్నర"-అతి వినయంగా జవాబిచ్చింది.

"ఇంతవరకు యిల్లు గుర్తులేదా?" కోపం వస్తున్నా సౌమ్యంగానే అడిగాడు.

"వచ్చింది కాబట్టే వచ్చాను" నిర్లక్ష్యంగా పడుకుంది రమ.

"ఏం, పాపం తలానీ యింట్లో పడుకోలేకపోయావా, ఇంత రాత్రి రాక పోతేనేం."

రమ గిరుక్కున తిరిగి తీక్షణంగా చూసింది....ఏదో విసురుగా అనబోయి వూరుకుంది.

"ఏం మాట్లాడవు?—అర్ధరాత్రి వరకు యిల్లుపట్టకుండా తిరగటంలో నీ ఉద్దేశం ఏమిటి?" తీక్షణంగా అడిగాడు.

"ఇంట్లో తోచకపోతే క్లబ్బుకి వెళ్ళడం తప్పా? తమరు వెళ్ళి ఆ ఫ్యాక్టరీలో కూర్చుంటే నే నిక్కడ గోళ్ళుగిల్లుకుంటూ కూర్చోవాలా?" రమ గొంతు హెచ్చించింది.

"తోచకపోతే....అర్ధరాత్రి వరకు పరాయి మగవాళ్ళతో త్రాగితందనాలాడుతున్నారా అందరాడాళ్ళు....నీకో మొగుడున్నాడన్న సంగతి గుర్తుందా అసలు?"

"ఏం గుర్తుండకపోవడానికి నా మతి సరిగానే వుంది యింకా....!"

"రమా. నీ ప్రవర్తన నాకేం నచ్చలేదు. ఇదివరకు చాలాసార్లు చెప్పాను. మళ్ళీ చెపుతున్నాను. ఇలా చేస్తే నే నూరుకోను ఎన్నాళ్ళో ...అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు. హూ. నా యింట్లో నా ఉప్పుతింటూ....నా ఎదురుగానే నీ నాటకాలు ఆడుతున్నావు....ఇది ఎంతమాత్రం సహించను." కోపంగా అరిచాడు రాజారావు.

రమ ఆడపులిలా ఆవేశంగా లేచి కూర్చుంది. "ఏం బెదిరిస్తున్నారా నన్ను.... ఈ బెదిరింపులకు దడవడానికి నేనేం చిన్న పిల్లని కాను....క్రింద దాసీదాన్ని కాను.... మీకంత కష్టంగా వుంటే మీకెలా నచ్చితే ఆ విధంగా చేసుకోండి. అంతేగాని ప్రతి రోజూ ఈ బెదిరింపులు మానండి." విసురుగా పడుకుంది రమ.

రాజారావు నిట్టూర్చాడు. లాభంలేదు!....రమని తనేం చెయ్యలేడు! తనది ఉత్త బెదిరింపు మాత్రమేనని రమకి తెలిసిపోయింది. అందుకే అంత నిర్లక్ష్యం! లక్షల కధికారి రాజారావు భార్యని వదిలేశాడని లోకం చెప్పుకోడం తను....భరించ లేడు! పరువుకోసం. ప్రతిష్ఠకోసం హాలాహలం అమృతంలా మింగుతాడు! ఆ సంగతి రమకీ తెల్సు అందుకే లెక్కచెయ్యటంలేదు తనని! సంఘంలో హోదాకోసం, పరువు కోసం రమ, తను భార్యాభర్తలలాగ....అన్యోన్య దంపతులుగా నటించాలి! తప్పదు! ఈ సొసైటీ లైఫ్. ఈ ఆడంబరాలకి దాసోహ మనక తప్పదు తనలాంటివాడు!

రమ! .. ఎంత నిశ్చింతగా నిద్రపోతూంది! అదృష్టవంతులు అందరూ! ఎయిర్ కూలర్లు, డన్‌లప్పిల్లోల మధ్యకూడా నిద్రకి నోచుకోని దురదృష్టవంతుడు తాను.... ఎందుకీ లక్షలు తనకి! ఇంటా బయటాకూడా సౌఖ్యములేని బ్రతుకు. ఈ సంగతి ఎందరికి తెలుసు?....

ఆలోచనలకి స్వస్తిచెప్పి లైటార్పి బలవంతాన కళ్ళు మూసుకున్నా నిద్ర పట్టని రాజారావు కళ్ళముందు....రమ, తులానీ, ఫ్యాక్టరీ ఘెరావ్ చేస్తున్న కూలీలే కన్పిస్తున్నారు. పాపం లక్షాధికారి రాజారావుకి నిద్ర ఎలా పడ్తుంది?!

★